ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం


ముండ్లమూరు: పోలింగ్ కేంద్రం వద్ద నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్


దొనకొండ: పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న డీఎస్పీ నారాయణరెడ్డి, తహసీల్దార్


తాళ్లూరులో పోలింగ్ సరళి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్


కురిచేడులో బారులుతీరిన ఓటర్లు


దర్శిలో సాయంత్రం 4 గంటల సమయంలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

దర్శి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు దర్శి మండలంలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సీఐ రామకోటయ్య, ఎస్‌ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటలకు గేట్లు మూసి వేశారు. ఉదయం మందకొడిగా పోలింగ్ సాగినా మధ్యాహ్నం నుంచి క్యూలైన్‌లలో ఓటర్లు బారులు తీరారు. సుమారు సాయంత్రం నాలుగు గంటలకు 500 మంది వరకు ఓటర్లు ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్నారు. నాలుగు గంటల్లోపు ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న వారికి టోకెన్‌లు ఇచ్చి వారందరూ ఓటేసేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మద్దిశెట్టి శ్రీధర్‌లు పోలింగ్ కేంద్రాల్లో బూత్‌లను పరిశీలించారు.

దొనకొండలో..

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. దర్శి డీఎస్పీ స్వామి నారాయణరెడ్డి, తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు పోలింగ్ బూత్‌లను పరిశీలించి ప్రశాంతంగా ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. దూర ప్రాంతాల నుంచి ఓటర్స్ వ్యయ ప్రయాసాలతో వచ్చి వారి ఓటును వినియోగించుకున్నారు. ఎస్‌ఐ సైదుబాబు ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారులు ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ఓటర్లకు చాలా ఉపయోగపడింది. హడావిడిగా ఓటరు స్లిప్ మర్చిపోయి పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు హెల్ప్ డెస్క్ ద్వారా తమ ఓటుకు సంబంధించిన వివరాలు, పోలింగ్ బూత్ వివరాలు తెలుసుకొని ఓటు వేశారు. బారులు తీరిన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీడ కోసం షామియానాలు, కూలింగ్ తాగునీటి వసతి కల్పించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సీఐ రామకోటయ్య పలు పర్యాయాలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పోలింగ్ కేంద్రం వద్ద ఏజెంట్లను, ఓటు వేసేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

కురిచేడులో..

కురిచేడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో 80 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్, ఎన్నికల అధికారి షేక్ నాగూల్ మీరా తెలిపారు. ఆరంభంలో కాస్త మందకొడిగా ప్రారంభమైనా గంట తర్వాత నుంచి ఓట్లు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఎండను కూడా లెక్కచేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గంటల కొద్దీ వేచి ఉన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక వీకే ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్స్‌కు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పోలింగ్ బూత్‌ను సందర్శించి నాయకులకు తగిన సూచనలు చేసారు. డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి, సీఐ రామకోటయ్యలు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

దర్శి నియోజకవర్గంలో..

దర్శి టౌన్: దర్శి నియోజకవర్గంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓట్లు అన్ని కలిపి మొత్తం 7297 ఉండగా అందులో 5593 మంది 76.64 శాతం ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రాడ్యుయేట్స్, టీచర్స్ సంబంధించి వేర్వేరుగా పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి. దర్శి నియోజకవర్గంలో పట్టభద్రుల్లో అత్యధికంగా కురిచేడు మండలంలో 82.28 శాతం ఓటింగ్ నమోదైంది.

పట్టభద్రులు ఓటింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలింగ్
దర్శి	3043	2212
తాళ్లూరు	794	645
దొనకొండ	959	749
కురిచేడు	813	669
ముండ్లమూరు	1266	921
	6875	5196

టీచర్ ఓటర్ల వివరాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్‌లో తాళ్లూరు మండలంలో అత్యధికంగా 98.28 శాతం నమోదైంది.

మండలం	మొత్తం ఓటర్లు	పోలింగ్
దర్శి	256	236
తాళ్లూరు	58	57
దొనకొండ	24	22
కురిచేడు	46	45
ముండ్లమూరు	38	37
	422	397

వైపాలెం నియోజకవర్గంలో..


పెద్దారవీడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీ సరళా వందనం


పెద్దదోర్నాలలో సాయంత్రం 4 గంటల సమయంలో క్యూలైన్‌లో పట్టభద్రులు

యర్రగొండపాలెం: తూర్పు రాయలసీయ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు యర్రగొండపాలెం నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. వైపాలెం మండలంలో ఎన్నికల నిర్వహణను తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి పర్యవేక్షించారు. సీఐ కె.మారుతీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై జి.కోటయ్య, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పుల్లలచెరువు: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 79 శాతం నమోదైనట్లు ఏఈఆర్వో దాసు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఈఆర్వో సరళావందనం పరిశీలించారు. సీఐ మారుతీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై సుదాకర్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

త్రిపురాంతకం: మండలంలో పట్టభద్రులు 82 శాతం, ఉపాధ్యాయులు 98 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దారవీడు: స్థానిక జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీ సరళా వందనం సందర్శించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, జోనల్ అధికారి యోగానందప్రసాద్, ఫ్లయింగ్ స్క్వాడ్ జయరాంనాయక్ ఉన్నారు.

పెద్దదోర్నాల: మండలంలో 94 శాతం పోలింగ్ నమోదైంది. 4 గంటల తర్వాత క్యూలైన్‌లో ఉన్న 200 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌లను డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ సరళా వందనం, సీఐ మారుతీకృష్ణ, ఎస్సై శ్రీనివాసరావు పరిశీలించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన మంత్రి


త్రిపురాంతకంలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

వైపాలెం/పుల్లలచెరువు/త్రిపురాంతకం/పెద్దారవీడు/పెద్దదోర్నాల: తూర్పు రాయలసీయ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైపాలెం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పోలింగ్ సరళిని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరిశీలించారు. ఆయా మండలాల స్థానిక నాయకులతో మాట్లాడి ఓటింగ్ శాతం, మెజార్టీ తదితర అంశాలు తెలుసుకున్నారు. పుల్లలచెరువులో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, త్రిపురాంతకంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, పెద్దారవీడులో కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి తదితరులు మంత్రిని కలిసి పోలింగ్ తీరును వివరించారు.

వైపాలెం నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్ల పోలింగ్

మండలం	పట్టభద్రుల ఓటర్లు	పోలైన ఓట్లు
వైపాలెం	1405	1070
పుల్లలచెరువు	696	556
త్రిపురాంతకం	985	805
పెద్దారవీడు	865	622
పెద్దదోర్నాల	974	780

వైపాలెం నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఓట్ల పోలింగ్

మండలం	ఉపాధ్యాయ ఓటర్లు	పోలైన ఓట్లు
వైపాలెం	63	55
పుల్లలచెరువు	25	24
త్రిపురాంతకం	73	71
పెద్దారవీడు	20	20
పెద్దదోర్నాల	102	96


త్రిపురాంతకంలో ఓటు వేసి వస్తున్న అంధ యువకుడు


వై.పాలెం పోలింగ్ కేంద్రం వద్ద పట్టభద్రుల క్యూ


పుల్లల చెరువులో బారులుదీరిన ఓటర్లు


త్రిపురాంతకంలో పోటెత్తిన ఓటర్లు


బేస్తవారిపేట : ఓటు వేసేందుకు బారులుదీరిన గ్రాడ్యుయేట్ ఓటర్లు


అర్ధవీడు : నాగులవరం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

గిద్దలూరు నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతం


కొమరోలు : వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు


కంభంలో పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్


ఫోన్‌లో పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన చైర్మన్

గిద్దలూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గిద్దలూరు నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పోలింగ్‌కు ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గిద్దలూరు మండల పరిధిలోని గ్రాడ్యుయేట్ ఓటర్లు 3,227 మందికిగానూ 2,254 మంది ఓటు వేయగా, 69.84 శాతం పోలింగ్ నమోదైంది. టీచర్లు 377 మందికిగానూ 356 మంది ఓటు వేయగా, 94.42 శాతం పోలింగ్ నమోదైంది.

కొమరోలు: కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పట్టభద్రుల ఓట్లు 903కిగానూ 637 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 487 మంది, మహిళలు 150 మంది ఓటు వేయగా 70 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 49 మందికిగానూ 48 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, పురుషులు 34, మహిళలు 14 మంది ఓటు వేశారు. 95 శాతం పోలింగ్ నమోదైంది. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు కొమరోలులో పోలింగ్ సరళి గురించి నాయకులతో మాట్లాడి తెలుసుకున్నారు.

అర్ధవీడు మండలంలో...

అర్ధవీడు (కంభం): మండలంలో పట్టభద్రులు 66 శాతం, ఉపాధ్యాయులు 93.18 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, రంగాపురం పోలింగ్ కేంద్రంలో 213 ఓట్లకుగానూ 123 మంది ఓటు వేశారు. నాగులవరంలో 227 ఓట్లకుగానూ 152 ఓట్లు, అర్ధవీడులో 380 ఓట్లకుగానూ 266 ఓట్లు నమోదయ్యాయి. ఉపాధ్యాయ ఓట్లు 44కుగానూ 41 పోలయ్యాయి.

బేస్తవారిపేట మండలంలో...

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 88 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకుగానూ 83 మంది, 1,363 గ్రాడ్యుయేట్ ఓటర్లకుగానూ 1,012 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి 94.31 శాతం, గ్రాడ్యుయేట్లకు సంబంధించి 74.24 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ కే శాంతి, ఎస్సై మాధవరావు పర్యవేక్షించారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరిశీలించారు.

కంభం మండలంలో...

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టభద్రులకు 2 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ఒక కేంద్రం, తురిమెళ్లలో పట్టభద్రులకు ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. కంభంలో 16వ బూత్‌లో 817 ఓట్లకుగానూ 634 ఓట్లు, 17వ బూత్‌లో 973 ఓట్లకుగానూ 702 ఓట్లు, తురిమెళ్లలో 253 ఓట్లకుగానూ 197 ఓట్లు, ఉపాధ్యాయులకు 256 ఓట్లకుగానూ 235 ఓట్లు పోలయ్యాయి. మొత్తం పట్టభద్రుల ఓట్లు 2,043కుగానూ 1,533 పోలయ్యాయి. మార్కాపురం సబ్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ ఎం.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


మార్కాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషిక్త్ కిశోర్, సబ్ కలెక్టర్ సేతు మాధవన్


పొదిలి: పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కనిగిరి ఆర్డీఓ సందీప్‌కుమార్


తర్లుపాడులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

మార్కాపురంలో..

మార్కాపురం: మార్కాపురంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై 4 గంటలకు ముగిసింది. అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు, సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఆధ్వర్యంలో అధికారులు ఎన్నికల ఏర్పాట్లు చేశారు. మొత్తం టీచర్స్ ఓటింగ్‌లో 548 ఓటర్లకు 507 ఓట్లు నమోదు కాగా 93 శాతం పోలింగ్ నమోదైంది. గ్రాడ్యుయేట్ ఓటర్లలో 6,270 మందికి 4,656 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దంపతులు, బాలుర ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఉపయోగించుకున్నారు.

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు దివ్యాంగుడు ఇబ్బంది పడుతుండగా సీఐ భీమానాయక్, రూరల్ ఎస్‌ఐ సుమన్‌లు చేతులతో తీసుకెళ్లి పోలింగ్ బూత్ దగ్గర దించడంతో ఓటు వేశాడు. ఆయన పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

జేసీ సందర్శన..

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ కలెక్టర్ సరళ వందనం పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పోలింగ్ కేంద్రాల సమీపానికి వచ్చి ఓటింగ్ శాతం వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లకు ఉన్న ఇబ్బందులను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు.

మార్కాపురం టౌన్: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం మార్కాపురం డివిజన్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్ విలేకర్లకు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో సీఐ భీమానాయక్, ఎస్‌ఐలు శశికుమార్, సుమన్, సువర్ణ, కృష్ణుడు, పలువురు ఏఎస్‌ఐలు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. సెల్‌ఫోన్‌లు అనుమతించకపోవడంతో పలువురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

పోలీస్ అధికారులు పోలింగ్ కేంద్రాల బయటే ఓటర్ల దగ్గర ఉన్న సెల్ ‌న్లు లోపలికి అనుమతించపోవడంతో చాలా మంది ఓటర్లు వెనక్కి వెళ్లిపోయారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో ఆయన సబ్ కలెక్టర్ సేతు మాధవన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. పోలింగ్ బూత్ వరకు వచ్చి తమ దగ్గర ఉన్న సెల్‌ఫోన్‌ను సమీపంలో ఉన్న పోలీస్ సిబ్బందికి ఇచ్చి ఓటు వేయవచ్చని చెప్పడంతో ఆ తర్వాత నుంచి పోలీసులు అనుమతించారు.

తర్లుపాడు: ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికీ గ్రాడ్యుయేట్ ఓటర్లు పోలింగ్ కేంద్రానికి ఆలస్యంగా రావడం మొదలు పెట్టారు. మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 87 శాతం పోలింగ్ నమోదు కాగా గ్రాడ్యుయేట్ ఓటర్లలో 73 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 3 గంటల నుంచి పోలింగ్ శాతం పెరిగింది. ఎస్‌ఐ ముక్కంటి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పొదిలి రూరల్: పొదిలిలో ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఉపాధ్యాయలకు ఒకటి, మూడు పట్టభద్రులకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుధాకర్‌రావు పర్యవేక్షణలో ఎస్‌ఐ మల్లికార్జున అధ్వర్యంలో దాదాపు 30 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలను కనిగిరి ఆర్డీఓ సందీప్‌కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పొదిలిలో పట్టభద్రులు మొత్తం 2701 మంది ఓటర్లు ఉండగా పోలైన ఓట్లు 2113, 78.05శాతం, ఉపాధ్యాయులు మొత్తం 207 మంది ఉండగా, పోలైన ఓట్లు 199. దాదాపు 96.13 శాతం ఓటింగ్ నమోదైంది.

క్లుప్తంగా

వేడుకగా శివపార్వతుల కల్యాణం


కల్యాణానికి హాజరైన భక్తులు

కొనకనమిట్ల: స్థానిక శివాలయంలో సోమవారం ప్రజలు వేడుకగా శివ పార్వతుల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వేదపండితుల పర్యవేక్షణలో ముందుగా పార్వతి, పరమేశ్వరులకు అర్చనలు, అభిషేకాలు చేశారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు పాల్గొని శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి కల్యాణం జరిపించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద కుంకుమార్చన పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి సంగమేశ్వర, పార్వతీదేవి, వినాయక స్వామి, నందీశ్వరులకు పూజలు చేశారు. నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేసి శాంతి పూజలు జరిపించుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి.. మొల్లమాంబ


నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: రామాయణాన్ని తెలుగులో అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని శాలివాహన సంఘ నాయకుడు మధుసూదనరావు అన్నారు. మొల్లమాంబ 583వ జయంతి సందర్భంగా పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు జనార్దన్, దగ్గుపాటి రమణ, అంకన్న, అద్దంకి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి



దర్శి: శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం జరిగే తిరునాళ్ల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందు రోజే భక్తులు తలంటు స్నానాలు చేసి స్వామి వారికి పొంగళ్లు నివేదన చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి తిరునాళ్లకు భక్తులు భారీగా హాజరవుతారు.

నులిపురుగుల నివారణకు చర్యలు


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి జ్యోతి

ముండ్లమూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా రెండేళ్ల చిన్నారుల నుంచి 19 ఏళ్ల వయసు వారికి అందరికి నులిపురుగుల నివారణకు మాత్రలు వేయాలని వైద్యాధికారి జ్యోతి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముండ్లమూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో 4379 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయాల్సి ఉందన్నారు. వారందరికీ మంగళవారం మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు వేయాలన్నారు. మిగిలిన వారికి మరుసటి రోజు వేయాల్సి ఉందన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పుల్లలచెరువు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 48 మంది విద్యార్థినులకు ఇక్కడి జెడ్పీ హైస్కూల్ 2004 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ప్యాడ్స్, పెన్నులను ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి చేతులమీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్యాడ్స్, పెన్నులు అందజేస్తున్న దాతలు